క్లుప్తంగా

రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు

ఉయ్యాలవాడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు వైఎస్ఆర్ క్రాంతి పథం ద్వారా కొత్తగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీఎం శేఖర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలో 150 సంఘాలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కాకరవాడ, సుద్దమల్ల గ్రామాల్లో ఒక్కొక్కటి ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో సంఘంలో 10 నుంచి 12 మంది పొదుపు మహిళల సభ్యులు కలిగి ఉంటారు. ప్రతి నెల రూ. 100 చొప్పున ఆరు నెలల పాటు బ్యాంకులో జమ చేస్తే ఆ తర్వాత రుణాలు పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని పొదుపు మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దుకాణాల్లో ధరల పట్టిక తప్పనిసరి

దొర్నిపాడు: ఎరువుల దుకాణాల్లో తప్పనిసరిగా రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు, విత్తనాల ధరలు తెలియజేసే బోర్డును ఏర్పాటు చేయాలని మండల వ్యవసాయాధికారి శ్రీక్రిష్ణ దుకాణాదారులకు ఆదేశించారు. బుధవారం స్థానిక వైఎస్సార్ రైతు భరోసా కేంద్రంలో ఎరువుల దుకాణాదారులతో ఆయన సమావేశమై మాట్లాడారు. ఎరువులను ఒక రైతుకు 10–15 బస్తాలు మాత్రమే ఇవ్వాలని, అలాగే ఎవరైనా నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయించినట్లు తెలిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

శిరివెళ్ల: మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైనట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీల బుధవారం తెలిపారు. ఒక టీచర్, రెండు ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. టీచర్ పోస్టుకు 10వ తరగతి, ఆయా పోస్టులకు 7వ తరగతి చదివి, 2022 జూలై ఒకటో తేదీ నాటికి 21 ఏళ్లు నిండిన వారు అర్హులన్నారు. ఆసక్తిగల వారు దరఖాస్తులను ఈ నెల 10వ తేదీలోగా డీపీఓ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

నేటి నుంచి నాటక సాహితీ ఉత్సవాలు

నంద్యాల(వ్యవసాయం): అజో విభో కందాళం ఫౌండేషన్, కళారాధన సాంస్కతిక సంస్థ సంయుక్త నిర్వహణలో 30వ వార్షిక తెలుగు రాష్ట్రాల నాటక సాహితీ సాంస్కృతిక ఉత్సవాలు ఈనెల 5 నుంచి 8వ తేదీ వరకు స్థానిక మున్సిపల్ టౌన్ హాల్‌లో జరగనున్నాయని ఫౌండేషన్ వ్యవస్థాపకులు అప్పాజోషుల సత్యనారాయణ, కళారాధన అధ్యక్షుడు డాక్టర్ మధుసూధన్‌రావు, డాక్టర్ రవికృష్ణ నిర్వహణ కమిటీ కన్వీనర్ మూర్తి తెలిపారు. బుధవారం టౌన్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సాయంత్రం 6 గంటల నుంచి 7 సాంఘిక నాటికలు ప్రదర్శిస్తారన్నారు. 5న మినిస్టరొత్తాండు, తెల్ల కలువల నల్ల కోయిల, స్వర్ణ కమలాలు. 6న కొత్త పరిమళం, అగ్ని సంసారం, 7న థ్యాంక్స్ ఫర్ ది పీఎం, ప్రేమతో నాన్న, 8న ఎంపీ, ఎమ్మెల్యేల చేతుల మీదుగా బహుమతి ప్రదానాలు ఉంటాయని చెప్పారు. ప్రతి రోజు ఉదయం సాహితీ సమాలోచన సదస్సులు, పుస్తకావిష్కరణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. నిర్వాహకులు ప్రసాద్, జనార్ధన్, శేషఫణి, శివరామిరెడ్డి పాల్గొన్నారు.

ఓబన్న సేవా సమితి సేవలు విస్తరిస్తాం

నంద్యాల(అర్బన్): అఖిల భారత వడ్డె ఓబన్న సేవలను మరింత విస్తరించనున్నట్లు సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బాల నరసింహుడు తెలిపారు. స్థానిక కార్యాలయంలో నంద్యాల, కర్నూలు జిల్లాల నూతన కమిటీలను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఓబన్న పేరును మరింత ప్రాముఖ్యంలోకి తెచ్చేందుకు సమితి సభ్యులు, నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాల అధ్యక్ష కార్యదర్శులతో పాటు సభ్యులు నిరంతరం సమితి సేవల్లో పాల్గొనాలని సూచించారు. నాయకులు బత్తుల సుబ్బరాయుడు, తిరుపాల్ బాబు, నూనె పల్లె సుబ్బరాయుడు, చిన్న సుబ్బరాయుడు, చల్లా వెంకటేసు, మద్దిలేటి పాల్గొన్నారు.

చిన్నారులందరికీ పోలియో చుక్కలు



పోలియో చుక్కల కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న డీఐఓ డాక్టర్ ప్రభావతి

నంద్యాల(అర్బన్): తొమ్మిది నెలల చిన్నారులందరికీ ఎఫ్ఐపీవీ (ఫ్రాక్షనల్ ఇనాక్టివేటెడ్ పోలియో వ్యాక్సిన్) మూడో విడత చుక్కలు వేయించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి డాక్టర్ ప్రభావతి తెలిపారు. స్థానిక గాంధీ నగర్‌లోనున్న డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్‌లో బుధవారం పోలియో మూడో డోస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ప్రతి బుధ, శనివారాల్లో జరిగే ఇమ్యునైజేషన్‌ను చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సిసీలియా, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్

- ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన
- పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి



దివ్యాంగురాలికి కొత్త పింఛన్ అందజేస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పింఛన్లు అందజేస్తోందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. వైఎస్సార్ పింఛన్ కానుక వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఆళ్లగడ్డ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ సుబ్బారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తమ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో కులం మతం, వర్గం చూడటం లేదన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని చెప్పారు. పింఛన్లు తొలగించేస్తున్నారంటూ ప్రతిపక్ష పార్టీలు పచ్చ మీడియాలో పిచ్చి రాతలు రాయిస్తున్నాయని మండిపడ్డారు. వారి ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదన్నారు. దమ్ముంటే చంద్రబాబు, ఎల్లో మీడియా అర్హుల్లో ఏ ఒక్కరికైనా పింఛన్ తొలగించి ఉంటే చూపించాలని సవాల్ విసిరారు. చంద్రబాబు పాలనలో ఎవరైనా చనిపోతేనే పింఛన్ వచ్చేదన్నారు. అది కూడా జన్మభూమి కమిటీలు ఆమోద ముద్ర వేస్తేనే మంజూరు చేసేవారన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదన్నారు.అర్హత ఉండి సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే వెంటనే పరిశీలించి పింఛన్ మంజూరు చేస్తున్నారన్నారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్‌ను పెంచుకుంటూ పోతున్నారన్నారు. ఇటీవలే పింఛన్‌ను రూ. 2500 నుంచి 2,750కు పెంచి పంపిణీ చేశారన్నారు. అలాగే కొత్త పెన్షన్లు కూడా మంజూరు చేశారన్నారు. అనంతరం కొత్త లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు నాయబ్‌రసూల్, మరియమ్మ, వైస్ ఎంపీపీ నాసారి వెంకటేశ్వర్లు, నాయకులు సుధాకర్‌రెడ్డి, నజీర్ ఉన్నారు

ఆలమూరులో కొత్త పింఛన్ల పంపిణీ

రుద్రవరం: మండల పరిధిలోని ఆలమూరులో బుధవారం కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. వితంతు పింఛన్లు–3, వికలాంగ పింఛన్లు–2, వృద్ధాప్య పింఛన్లు–10 మొత్తం 15 గ్రామానికి మంజూరయ్యాయి. గ్రామ సర్పంచు పాణ్యం లక్ష్మీదేవి, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేష్, చంద్ర, ప్రభాకర్, బ్రహ్మయ్య, లక్ష్మీనారాయణ, అన్సర్, మస్తాన్ గారి హుసేన్, జయరాముడు చేతుల మీదుగా పెన్షన్‌ను లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి పాములేటి తెలిపారు.



ఆలమూరులో కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ

ఉయ్యాలవాడ : మండలంలో నాలుగో రోజు బుధవారం పెన్షన్ల పంపిణీ కొనసాగింది. పెద్దయమ్మనూరు గ్రామంలో లబ్ధిదారులకు పెంచిన పింఛన్‌ను జెడ్పీటీసీ సభ్యురాలు కసాని పుణ్యలక్ష్మీదేవి అందజేశారు. గత ప్రభుత్వంలో పింఛన్ పొందాలంటే జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టు తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ నేరుగా ప్రభుత్వమే పెన్షన్ మంజూరు చేస్తోందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నూర్‌బాషా, సచివాలయ కన్వీనర్ పాల్గొన్నారు.

రేపు హ్యాండ్ బాల్ ఎంపిక పోటీలు

నంద్యాల(సిటీ): జిల్లాస్థాయి హ్యాండ్ బాల్ బాలుర సబ్ జూనియర్ (అండర్–15), జూనియర్ (అండర్–19) జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 6వ తేదీన నిర్వహిస్తామని హ్యాండ్‌బాల్ సంఘం ప్రతినిధులు మహబూబ్ బాషా, రామేశ్వరరెడ్డి, రాజకుమార్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక రామకృష్ణ పీజీ కళాశాల మైదానంలో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు సబ్ జూనియర్ 2007–09, జూనియర్ 2003–06 సంవత్సరాల మధ్యలో జన్మించిన వారు అర్హులన్నారు. ఎంపికైన జట్లు ఈ నెల 13,14 తేదీల్లో కృష్ణా జిల్లా గన్నవరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

దుకాణాలను పూర్తిస్థాయిలో సిద్ధం చేయండి

నంద్యాల(సిటీ): మున్సిపల్ దుకాణాలను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. గురువారం నుంచి దుకాణాలకు బహిరంగ వేలం నిర్వహించనున్నారు. నాలుగు రోజుల పాటు వేలాలు జరగనున్నాయి. ఈలోపు అవసరమైన దుకాణాల్లో వసతుల కల్పన, మరమ్మతులు చేస్తున్నారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లోనున్న దుకాణాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దుకాణాల్లో చేపట్టిన పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఆర్ఐ గులాం హుసేన్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది రిజ్వానా, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా బ్రెయిలీ జయంతి



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న వైద్యులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణ శివారులోని క్రాంతినగర్‌లోని జీవనజ్యోతి అంధుల పాఠశాలలో డాక్టర్ లూయిస్ బ్రెయిలీ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైద్యులు మహబూబ్ బాషా, ఆనంద్ కుమార్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంధ విద్యార్థులకు దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల నిర్వాహకులు వలిబాషా, మహేశ్వరరెడ్డి, ఫణిహాసరావు పాల్గొన్నారు.



రుద్రవరం భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

దివ్యాంగులకు ప్రత్యేక రాయితీలు

రుద్రవరం: విద్య సంబంధ అంశాల్లో దివ్యాంగులకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు కల్పించిందని భవిత కేంద్రం ఉపాధ్యాయులు నీలకంటేశ్వరరావు అన్నారు. ప్రపంచ అంధుల దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఖాదర్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

జీఓ రద్దు చేయాలి

నంద్యాల(అర్బన్): ర్యాలీలు, సభలు, రహదారులపై జరిగే కార్యక్రమాలను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్–1 వెంటనే ఉపసంహరించుకోవాలని పలు ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు, ఏఐటీయూసీ, సీపీఎం, సీపీఐ, సీఐటీయూ నాయకులు ప్రసాద్, నరసింహ, రమేష్ కుమార్ శ్రీనివాసులు పాల్గొని ప్రభుత్వ చర్యను నిరసిస్తూ జీఓ పత్రాలను దహనం చేశారు.

విద్యార్థుల భవితకు బంగారు బాట

నంద్యాల(సిటీ): విద్యార్థుల భవితకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బంగారు బాటలు వేస్తున్నారని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక 36వ వార్డులోనున్న శ్రీ రామకృష్ణ విద్యాలయ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక విద్యలోనూ రాణించాలని ప్రభుత్వం ట్యాబులను బైజూస్ కంటెంట్‌తో అందిచడం హర్షణీయమన్నారు. ఇప్పటికే నాడు–నేడుతో పాఠశాలలను ఆధునికీకరించారని, అన్ని రకాల వసతులు సమకూర్చారని, విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులు, పాఠశాల, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు.ఎంఈఓ బ్రహ్మం నాయక్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేసిన ఎమ్మెల్యే శిల్పా రవి

భూ హక్కు పత్రాల పంపిణీ

నంద్యాల(రూరల్): వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష పథకంతో రెవెన్యూ విభాగంలో కొత్త అంకం ప్రారంభమైందని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బిళ్లలాపురం గ్రామంలో 208 మంది రైతులకు జగనన్న భూ హక్కు పత్రాలను ఎమ్మెల్సీ ఇస్సాక్ బాషాతో కలిసి బుధవారం పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ వందేళ్లుగా పరిష్కారం కాని భూ సమస్యలను పరిష్కరించి, వారికి శాశ్వత పత్రాలు అందజేస్తుండటం పట్ల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నరన్నారు. అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా ప్రతి కమతానికి నంబర్ ఉంటుందని, దీంతో భూ తగదాలు తలెత్తే అవకాశంలేదని చెప్పారు. ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ సిద్దం శివరాం, సర్పంచ్ రమణమ్మ, ఎంపీటీసీ రామలక్ష్మమ్మ, నాయకులు సుబ్బయ్య, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



భూహక్కు ప్రతాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇస్సాక్ బాషా

గడప వద్దకే సంక్షేమ పథకాలు

- ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ అమలు
- ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి
- రుద్రవరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న దృశ్యం

రుద్రవరం: గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేదల ఇంటి ముంగిటకు తీసుకొచ్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. బుధవారం రుద్రవరం సచివాలయ–2 పరిధిలో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహిచారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు, జరిగిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఏదైనా పని ఉంటే మండల కేంద్రాలకు రావాల్సి ఉండేదని ఇప్పుడు స్థానిక సచివాలయాల్లోనే అన్ని రకాల సేవలు లభిస్తున్నాయన్నారు. ఒక్క రూపాయ కూడా అవినీతి లేకండా డీబీటీ విధానంలో ప్రజలకు నేరుగా సాయం అందజేస్తున్నామన్నారు. మూడున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో చేసిన లబ్ధిని వివరించడానికే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇంకా ఎవరైనా అర్హులై ఉండి పథకాలు అందకపోతే వెంటనే సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశామన్నారు. అవ్వాతాతలకు ఈనెల నుంచి 2,750 పింఛన్ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో పుట్టాలమ్మ క్షేత్రం చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ గంగిశెట్టి తిమ్మయ్య, ఆళ్లగడ్డ మార్కెట్‌యార్డు చైర్మన్ గంధం రాఘవరెడ్డి, ఎంపీపీ బాలస్వామి, నాయకులు బైరీ బ్రహ్మం, కొల్లంపుల్లయ్య, కృష్ణమూర్తి, లడ్డన్న, మాధవ, నాగేష్, జయరాముడు, తహసీల్దార్ వెంకటకృష్ణ, ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి నిర్మాణ పనులు వేగవంతం చేయండి

ఆళ్లగడ్డ:ఆసుపత్రి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం నిర్మాణపనులను బుధవారం ఆయన పరిశీలించారు.ఆరోగ్య కేంద్రం భవనం చుట్టూ అభివృద్ధి పనులు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యతకు పెద్ద పీట వేయాలని సూచించారు.కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత, మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఉన్నారు

రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోండి

నంద్యాల(అర్బన్): జాతీయ రహదారులు, పవర్ ప్రాజెక్టుల కోసం తీసుకునే భూములపై రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని, అలా కాకుండా భూములను బలవంతంగా లాక్కుంటే సహించేది లేదని రైతు సంఘం నేతలు పేర్కొన్నారు. స్థానిక నరసింహయ్య భవన్‌లో బుధవారం ఏపీ రైతుసంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భూములు కోల్పోయిన రైతులతో సమావేశం నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని 167–కే, 390 జాతీయ రహదారుల నిర్మాణం కోసం, పిన్నాపురం వద్ద నిర్మిస్తున్న సోలార్ ప్రాజెక్టు కోసం రైతులకు నోటీసులు ఇవ్వకుండా భూములు తీసుకోవడం దారుణమన్నారు. అనంతరం డీఆర్ఓ పుల్లయ్యకు వినతి పత్రం అందజేశారు. అక్కడ వారు మాట్లాడుతూ గ్రామసభలు నిర్వహించి రైతులను భాగస్వాములను చేస్తూ ధరలు నిర్ణయించాక భూములు తీసుకోవాలని కోరారు. నాయకులు రాజశేఖర్, రామచంద్రుడు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



డీఆర్ఓకు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

గోస్పాడు: ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ సుగుణశ్రీ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండలానికి 1,103 ఇళ్లు మంజూరుకాగా ఇప్పటికే 507 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారని చెప్పారు. మిగిలినవి వెంటనే పనులు చేపట్టేలా లబ్ధిదారులకు సిబ్బంది అవగాహన కల్పించాలని ఆదేశించారు. బిల్లులను దశల వారీగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నామని చెప్పారు. గృహ నిర్మాణదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. హౌసింగ్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

జొన్న కోతలు ముమ్మరం

జొన్న పంట చేతికి రావడంతో కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలో ఈ ఈ పంట 1,904 హెక్టార్లలో సాగుచేశారు. ప్రస్తుతం కోతలు జరుగుతుండంతో ఎకరానికి 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడులు వస్తున్నాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్లో క్వింటా రూ.2,900 నుంచి రూ.3,200 ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. దిగుబడులు, ధరలు ఆశాజనకంగా ఉండటంతో ఈ సారి జొన్న రైతులు లాభాలు గడించనున్నారు.

– దొర్నిపాడు



దొర్నిపాడు పరిసరాల్లో యంత్రంతో జొన్నకోతలు చేస్తున్న దృశ్యం

13 నుంచి బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్

వెలుగోడు: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 13, 14వ తేదీల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాస్థాయి బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ యూత్ నాయకుడు షంషీర్ అలీ తెలిపారు. బుధవారం టోర్నమెంట్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి వరుసగా రూ.8,000, రూ.7,000, రూ. 6,000,రూ.5,000, రూ.4,000, రూ.3,000, రూ. 2,000,రూ. 1000 (దాత: మొహమ్మద్ ఖాన్) అందజేస్తారని తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్లు రూ.300 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9885204197 నంబర్లో సంప్రదించాలని కోరారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ఆళ్లగడ్డ: పట్టణంలోని అమ్మవారిశాల వీధిలో భిక్షాటన చేస్తూ జీవించే ఓబులేసు బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బృందావన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఈపనగండ్ల శ్రీనివాసులు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. తర్వాత ఆయన స్థానిక యువకులు సురేష్, ఓబులేసు, కార్తీక్, ప్రసాద్, మైఖేల్‌తో కలిసి అంత్యక్రియలు నిర్వహించారు.

శనగల బసవన్నకు పరోక్షసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోని స్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలో శనగన బసవన్నగా పేరుపొందిన నందీశ్వరుడికి బుధవారం సాయంత్రం త్రయోదశి సందర్భంగా పరోక్ష సేవను ఈఓ ఎస్ లవన్న, అర్చకులు పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా నందీశ్వరస్వామికి పంచామృతాలతో అభిషేకాధి అర్చనలను గావించారు. ఆరంభ పూజలలో భాగంగా లోకక్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజ చేశారు. శనగల బసవన్నకు శాస్త్రోక్తంగా విశేష అన్నాభిషేకాలను నిర్వహించారు. తరువాత నందీశ్వర స్వామికి నూతన వస్త్రసమర్పణ విశేషార్చనలను, నానపెట్టిన శనగలను మహా నైవేద్యంగా సమర్పించారు.



శనగల బసవన్నకు పూజలు నిర్వహిస్తున్న ఈఓ, అర్చకులు

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

బొమ్మలసత్రం: పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, అందుకే మనది పేదల ప్రభుత్వమని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్‌బాషా పేర్కొన్నారు. పట్టణంలోని 41వ వార్డులో బుధవారం వార్డు కౌన్సిలర్ పున్నా రాజేశ్వరి, మాజీ కౌన్సిలర్ పున్నా శేషయ్య ఆధ్వర్యంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కాలనీకి చేరుకున్న వారికి స్థానికులు, నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి అందిన సంక్షేమ పథకాలు, పొందిన లబ్ధిని వివరించి బుక్‌లెట్ అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎవరైనా అర్హులై ఉండి పథకాలు అందకపోతే సంబంధిత ధ్రువపత్రాలతో స్థానిక సచివాలయాల్లో సంప్రదించాలని, అక్కడి సిబ్బంది విచారణ చేసి అర్హులని తేలితే వెంటనే పథకాలు అందేలా చూస్తారని, ఇందుకు ఎవరి సిఫారసు అవసరం లేదని చెప్పారు. స్థానికంగా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కొందరు ప్రస్తావించిన పలు సమస్యలకు అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కారం చేయాలని ఆదేశించారు. గత ప్రభుత్వంలో పథకాల పేరుతో పేదల అందకుండా చేసి వారి కడుపుకొట్టి ఆ పార్టీ నేతలు కోట్లు దండుకున్నారని ఆరోపించారు. గత పాలన, జగనన్న పాలనలో ఉన్న తేడాలని గమనించాలని, ఎవరు నిస్వార్థంగా, పారదర్శకంగా పథకాల అమలు, అభివృద్ధి పనులు, పాలన సాగిస్తున్నారో వ్యత్యాసం గమనించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, వైస్‌చైర్మన్‌లు గంగిశెట్టి శ్రీధర్, పాంశావలి, కమిషనర్ రవిచంద్రారెడ్డి, నాయకులు శేషఫణి, మోహన్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శిల్పా రవికి గజమాలతో స్వాగతం పలుకుతున్న దృశ్యం